'మినరల్' ముసుగు..!

రాజేంద్రనగర్ సర్కిల్‌లో మినరల్ వాటర్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా.. కనీస నాణ్యత ప్రమాణాలను పాటించకుండా వ్యాపారులు నీటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. – శాస్త్రీపురం

- జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్‌లో దాదాపు చిన్నచితకా 30కిపైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. ఇందులో కనీసం 10 వాటికి కూడా ప్రభుత్వ అనుమతి లేదు. అధికారులు వాటర్ ప్లాంట్‌లపై నిఘా పెట్టక పోవడంతో పూటకో వాటర్ ప్లాంట్ పుట్టుకొస్తోంది.
- ఐఎస్ఐ మార్కు లేకుండా నీటిని విక్రయించేస్తున్నారు. కిరాణా.. జనరల్ స్టోర్స్, మెడికల్ షాపులు, హోటళ్ల వద్ద మినరల్ వాటర్ బబూల్స్‌ను విక్రయిస్తున్నారు. నిర్దిష్ట ధర అనేది లేకుండా రూ. 15 మొదలు కొని రూ. 35 వరకు బబూల్స్‌ను విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.
- రాజేంద్రనగర్‌లో దాదాపు 40కిపైగా వివిధ వాటర్ సప్లయ్ కంపెనీలు నీటిని ఇంటింటికీ తిరిగి అందజేస్తున్నాయి. ఒకే ప్లాంట్ నుంచి నీటిని తీసుకొని వేరు వేరు కంపెనీల పేరుతో నీటిని సరఫరా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- కనీస నాణ్యత, పరిశుభ్రతలపై తనిఖీలు చేసిన పాపాన పోకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నారు. నీటి వ్యాపారులు అందరు కలిసి ప్రతి నెల అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందజేస్తున్నందునే వారు ఈ తరహా నీటి వ్యాపారం వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి.
- వేసవిలో వ్యాపారులకు నీటి వ్యాపారం మరింత లాభాలను చేకూర్చుతుండటంతో వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది.
- అపార్టుమెంట్లు, కాలనీలవాసులు నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మినరల్ వాటర్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వ్యాపారులు దీనినే అవకాశంగా తీసుకొని అపరిశుభ్రమైన బాటిళ్లలో నీటిని అందిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. వ్యాపారులను ఏమీ అనలేక నీటి కొరతతో నకిలీ మినరల్ వాటర్ తాగుతూ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు.

బోర్ నీటినే...

సర్కిల్ పరిధిలోని పలు మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు బోర్ నీటినే బబూల్స్‌లో నింపి విక్రయిస్తున్నారు. ఫిల్టర్ చేసే సమయంలోనే నీటి ట్యాంకుల్లో సగం బోర్ నీటిని నింపి అందులో సగం మినరల్ నీటిని కలుపుతున్నారు.

- రుచి కోసం పౌడర్, లిక్విడ్‌లను కలుపుతున్నట్లు సమాచారం. ప్లాంట్‌లో పెద్దమొత్తంలో బబూల్స్‌ను కొనుగోలు చేసే వారికి సగం మినరల్ వాటర్, సగం బోర్‌నీటినే అందజేస్తున్నారు. దీంతో నీటిని తాగిన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఏళ్ల తరబడి ఉపయోగించే నీటి బాటిళ్లను వాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.
- వ్యాపారులు ఏనాడూ నీటి బాటిళ్లను శుభ్రం చేసినా దాఖలాలు ఉండవనే ఆరోపణలున్నాయి. బాటిళ్లో దుర్వాసన వస్తుడటంతో ఇదేమిటని ప్రశ్నిస్తే మినరల్ వాటర్ బాటిళ్లు అలాగే ఉంటాయని ఇష్టం అయితే తీసుకోండి.. లేదంటే లేదు అంటూ పలువురు వ్యాపారులు దబాయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు..


అమ్మకానికి సిద్ధంగా ఉన్న నాణ్యతలేని మినరల్ వాటర్ బబూల్స్

అధికారులూ దృష్టి సారించండి...

సర్కిల్‌లో జరుగుతున్న మినరల్ వ్యాపారంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బోర్ నీటినే మినరల్ వాటర్ పేరుతో అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్న ప్లాంట్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు లేని ప్లాంట్‌లను మూసి వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

మణికొండ: ప్రపంచ వ్యాప్తంగా తాగునీటి వనరులు తగ్గిపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పీడ్ ఎన్‌జీఓ అధ్యక్షుడు నందీశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో నీటి పొదుపుపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోని చాలా నగరాలలో వేసవిలో నీటి ఇబ్బందులు నెలకొంటాయన్నారు. అవసరానికి మించి నీటిని వినియోగం చేయటం, భూగర్భ జాలాలు తగ్గిపోవటం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయకపోవటమే ప్రధాన కారణమన్నారు. భూమి నుంచి ఎంత నీటిని తీసుకుంటున్నామో తిరిగి అంతే నీటిని భూమిలోకి పంపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఇంట్లో నీటి సంపు మాదిరిగానే ఇంకుడు గుంత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంఘాల ఆర్‌పీ మంజు, టీఎంసీ లక్ష్మి, లావణ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



చిత్రపురి కాలనీలో నీటి పొదుపుపై అవగాహన కల్పించిన ఎన్‌జీఓ ప్రతినిధి

విద్యాలయాల అభివృద్ధికి కృషి

శంషాబాద్: విద్యాలయాలు.. సామాజిక దేవాలయాలని ఫ్రాంక్లిన్ టెంపుల్‌టౌన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గౌరవ్‌గార్గ్ అన్నారు. రౌండ్‌టేబుల్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సహకారంతో తొండుపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మూడు అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాలయాల అభివృద్ధికి తమ సంస్థ చేసిన కృషిని వివరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నాగలక్ష్మి, చైతన్య, అఖిల్ దుండూ, మక్సూద్ అహ్మద్, హర్షిత్, లోకేశ్వర్ రెడ్డి, స్థానిక నేతలు పి.శ్రీనివాస్‌గౌడ్, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

దూద్‌బౌలి: తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన అధికారి బి.మంగ అన్నారు. పాతబస్తీలోని డాన్ హైస్కూల్‌లో గురువారం ఆమె ఉద్యానవనాల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తోటల పెంపకంపై విద్యార్థులు ఆసక్తి కనబరచాలని పిలుపునిచ్చారు. తోటల పెంపకంతో దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తుందని, పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. స్వయంగా తోటలు పెంచడంతో నాణ్యమైన ఫలాలను పొందవచ్చన్నారు. ఆమె మొక్కలు నాటడం, పచ్చదనం ప్రాముఖ్యతను విద్యార్థులతో చర్చించారు. ఆరోగ్యకరమైన సాగు మొక్కల పెంపకంలో వినూత్న ఆలోచనలను పంచుకున్నారు.

12,13వ తేదీలలో 'ఏఐ' ఫ్లాగ్‌షిప్ సమావేశం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, విశ్వం డాట్ ఏఐ, స్వేచ్ఛ డాట్ ఓఆర్‌జీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 12,13 తేదీలలో 'ఏఐ ఫ్లాగ్‌షిప్ రెండవ ఎడిషన్ సమావేశం' నిర్వహించాలని గురువారం నిర్ణయించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొంటారు. ఈ సమావేశంలో డెవలపర్లు, ఆర్కిటెక్టులు, స్టార్టప్‌లు, టెక్ లీడర్లు, పాలసీ మేకర్లు పాల్గొనే రెండు రోజుల సదస్సులో ఏఐ సాధనాలు, సాంకేతికతపై వర్క్‌షాప్‌లు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తారు. 25కు పైగా సంస్థలు, దాదాపు 250 జట్లు భాగస్వాములవుతారు.

వైస్ చాన్సలర్ ఖోఖో చాంపియన్‌గా జీఎన్ఐటీఎస్ టీమ్



గోల్కొండ: తమ కళాశాల కేవలం విద్యాబోధనలోనే కాకుండా క్రీడల్లోనూ విశేషంగా రాణిస్తుందని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. గురువారం కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన వైస్ చాన్సలర్ ఖోఖో చాంపియన్‌షిప్‌లో జీఎన్ఐటీఎస్‌లో టీమ్ విజేతగా నిలిచింది. మొత్తం టోర్నమెంట్‌లో మీనాక్షి ఖోఖోలో అత్యుత్తమ ఆల్ రౌండర్‌గా, మనస్విని ఉత్తమ రన్నర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తమ విద్యార్థినులు ఇష్టపడే క్రీడల్లో అత్యుత్తమ కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నాని పేర్కొన్నారు.

నిత్యం ఖురాన్ పఠించాలి

సాక్షి, సిటీబ్యూరో: ఖురాన్‌ను నిత్యం పారాయణం చేసి ఆచరించాలని ఈజిప్ట్ జామియా హజార్ యూనివర్సిటీ ఇస్లామిక్ స్కాలర్స్ షేక్ ఇస్మాయిల్, షేక్ నూర్ సూచించారు. గురువారం బషీర్‌బాగ్‌లోని మీడియా ప్లేస్‌లో ఏర్పాటు చేసిన ఖురాన్ పారాయణ కార్యక్రమంలో వారు పాల్గొని ఖురాన్ పవిత్రతను వివరించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఖురాన్‌లో పేర్కొన్న విధంగా ఆచరించాల్సిన నియమ నిబంధనలను, విసర్జించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. దివ్య ఖురాన్ అవతరణ దాని ఉద్దేశాలు, రంజాన్ ఉపవాసల గురించి ప్రత్యేకంగా వివరించారు. మీడియా ప్లస్ సీఈఓ సయ్యద్ ఖాలేద్ పర్వేజ్ మాట్లాడుతూ..ఏటా రంజాన్ పవిత్ర మాసంలో ఖురాన్ పారాయణం దాని విశిష్టత గురించి తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు రచయితల కవి సాహిత్య భూషణ్ గ్రహీత మహమ్మద్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ ప్రారంభం


పోస్టర్‌ను, తలంబ్రాల అడ్వాన్స్ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్ తదితరులు

చాంద్రాయణగుట్ట: తెలంగాణ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి వెంకటేశ్ పిలుపునిచ్చారు. వచ్చే నెల 6న భద్రాచలంలో జరగనున్న సీతారాముల కల్యాణానికి వెళ్లలేని భక్తులకు ఇళ్ల వద్దకే రాములోరి తలంబ్రాలను అందజేసేందుకు టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ వారి సౌజన్యంతో ఏర్పాట్లు చేసింది. పాతబస్తీ అలియాబాద్ రాజన్నబావి సమీపంలోని సాయిబాబా ఆలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై సీతారాముల కల్యాణ తలంబ్రాల పోస్టర్‌ను, తలంబ్రాల అడ్వాన్స్ బుకింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫలక్‌నుమా డిపో ఆధ్వర్యంలో కేవలం రూ.151 మాత్రమే చెల్లించి ప్రముఖ ఆలయాల వద్ద, ఎంజీబీఎస్‌లోని కార్గో పార్శిల్ బుకింగ్ కౌంటర్‌లో భక్తులు తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఫలక్‌నుమా డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.సతీష్ కుమార్, అధికారి సాయికృష్ణ పాల్గొన్నారు.

29న రక్తదాన శిబిరం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీకన్సల్ట్ ఆధ్వర్యంలో జనని బ్లడ్ సెంటర్ సహకారంతో ఈనెల 29వ తేదీ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు శిబిరం ఉంటుంది. 17 ఏళ్ళ నుంచి 60 ఏళ్ళ వయస్సులోపు ఆరోగ్యవంతులైనవారు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని నిర్వాహకులు తెలిపారు.మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 8074649910లో సంప్రదించాలని వారు కోరారు.

పన్నుల భారం తగ్గించండి

మణికొండ: జీహెచ్ఎంసీ పరిధిలో కన్నా రెండు రెట్ల అధిక పన్నును మణికొండ మున్సిపాలిటీలో అధికారులు ప్రజలపై మోపుతున్నారని, దానిపై మున్సిపాలిటీలో ఎలాంటి చర్చ లేకుండానే మున్సిపల్ చట్టానికి భిన్నంగా అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆరోపించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మున్సిపల్ పాలకవర్గం తీర్మానం లేకుండానే పన్నుల పెంపును చేపట్టారని సభ్యులే తెలిపారన్నారు. ప్రజలు మున్సిపాలిటీలో అధిక శాతంగా పన్నులు చెల్లిస్తున్నా తమకు అవసరమైన డ్రైనేజీ, రోడ్లు లేకపోవటం, వరద ముంపు సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని వారు వాపోయారన్నారు. లక్ష్మీనగర్‌కాలనీలో వర్షాకాలంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరుతుందన్నారు. నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, శ్రీకాంత్, ఉపేంద్రనాథ్ రెడ్డి, జి.విఠల్, సుమనళిని, మల్లేష్, దిలిప్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీనగర్ కాలనీలో మాజీ వైస్ చైర్మన్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణకు కృషి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కమిటీ ప్రతినిధులు


రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జైభీమ్ జైరామ్ జయంతి ఉత్సవ కమిటీ–2025 ఆధ్వర్యంలో రూపొందించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాల బ్రోచర్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం మాట్లాడుతూ... మహనీయుల జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జయంతి ఉత్సవాల వ్యవస్థాపక అధ్యక్షుడు పోయిల జీవన్‌దాస్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వనం నర్సింహ మాదిగ, మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్, వర్రి లలిత్, తులసీరామ్, మాజీ అధ్యక్షుడు గోల్కొండ రాజ్‌కుమార్, పంబాల రాజు, పలుగుచెరువు మహేశ్, మంగళారం శ్రీనివాస్, దాసరి రమేశ్, రగడంపల్లి శ్రావణ్, జాన్‌పాల్, కె.చెన్నయ్య, గడ్డం సామెల్, నత్తి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ముగిసిన హ్యాకథాన్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల వార్షికోత్సవ సంబరం నిర్వాణ–2025లో భాగంగా బుధవారం ప్రారంభమైన 24 గంటల సాంకేతిక హ్యాకథాన్ గురువారం ముగిసింది. జాతీయ స్థాయిలో జరిగిన కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన 1100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, రోబొటిక్స్, సస్టైనబుల్ ఇన్నొ, ఓపెన్ ఇన్నొవేషన్ లాంటి పోటీలలో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం క్రీడా దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరై సందడి చేశారు. ముఖ్య అతిథి జేఎన్‌టీయూ ఆర్డీ డైరెక్టర్ వి.కామాక్షిప్రసాద్, గౌరవ అతిథి, జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి, యోగా గురువు కె.అరుణాదేవి మాట్లాడుతూ... భారత్‌ను పూర్వంలా విశ్వగురువుగా నిలిపేందుకు యువత కృషి చేయాలన్నారు. క్రీడలు, యోగా ద్వారా విద్యార్థులు ఒత్తిడిని జయించటంతో పాటు శారీరక, మానసికంగా దృఢంగా ఉండటం, జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చన్నారు. క్రీడలు, టెక్నో ఫెస్ట్‌లలో రాణించిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్ర మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడా దినోత్సవంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మహిళలకు న్యాయం


కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సుజాత గుప్తా తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణలో మహిళలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్తా అన్నారు. గురువారం కార్వాన్ సబ్జిమండిలో కాంగ్రెస్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నికల హామీలలో మహిళలకు ఇచ్చిన హామీలు సీఎం రేవంత్‌రెడ్డి ఒకొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్వాన్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజరి, మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి మామిడి మాధవి, మలక్‌పేట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మహ్మద్ ఖాదీర్ తదితరులున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


సబితారాయ్ (ఫైల్)

మణికొండ: నచ్చని వ్యక్తితో వివాహం చేయటం, భర్తతో తరచూ గొడవలు జరుగుతుండటాన్ని జీర్ణించుకోలేని ఓ మహిళ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వెనుక గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... శుభజిత్ రాయ్ అనే వ్యక్తి తన భార్య సబితారాయ్(22), 4 సంవత్సరాల కుమారుడితో కలిసి రెండు నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం ఒరిస్సా నుంచి నార్సింగికి వచ్చి ఉంటున్నారు. అయితే సబితారాయ్‌కి నచ్చని వివాహం చేయటం, కొంత కాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. వాటితో విసిగి వేసారిన ఆమె గురువారం ఉదయం తన భర్త విధులకు వెళ్లాడు. ఆమె ఇంట్లోనే ఉంది. ఆమె సోదరి అంజలిరాయ్ దాస్ మధ్యాహ్నం ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవటంతో ఆమె ఇంటికి వచ్చింది. పలుమార్లు తలుపు తట్టినా తీయకపోవటంతో కిటికీలోంచి చూడగా ఆత్మహత్య చేసుకున్నట్టు గమనించారు. చుట్టు పక్కల వారి సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమెను కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కలుషిత నీటి నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కలుషిత నీరు సరఫరా అవుతున్నాయంటూ 'సాక్షి' దినపత్రిలో గురువారం ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. బండ్లగూడలో కలుషిత నీటి సరఫరా అనే శీర్షికను కథనం ప్రచురించడంతో గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు, జలమండలి అధికారులు హిమాయత్‌సాగర్ చెరువుతో పాటు కిస్మత్‌పూర్ సెక్షన్‌లోని ఫిల్టర్ పాయింట్‌లోని నీటి సాంపిల్స్‌ను సేకరించారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు కృషి చేస్తామని సమస్యలు లేకుండా చూస్తామని జలమండలి మేనేజర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.


నీటి సాంపిల్స్‌ను కలెక్ట్ చేస్తున్న అధికారులు

గోల్కొండ కోట కందకాలు మాయం?

గోల్కొండ: గోల్కొండ కోటకు రక్షణగా ఉన్న కందకాలు ఒకొక్కటిగా కబ్జా చేయడానికి కబ్జాదారులు పక్కా స్కెచ్‌తో ముందుకు సాగుతున్నారు. గోల్కొండ కోటకు చుట్టూ ఉన్న ప్రహరీకి లోతైన కందకాలు ఉన్నాయి. గోల్కొండ కోటపైకి దండయాత్రకు వచ్చే వారు కోట గోడలను ఎక్కకుండా ఈ కందకాలను ఏర్పాటు చేశారు. నేడు కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని ఒకొక్కటిగా మాయం అవుతున్నాయి. గోల్కొండ మోతీదర్వాజ, ఫతేదర్వాజా, జమాలి దర్వాజా, బంజారి దర్వాజాలకు ఇరువైపులకు ఆనుకొని ఉన్న కందకాల్లో టన్నుల కొద్ది వ్యర్థాలు ఇక్కడికే డంప్ అయ్యాయి. కందకాలకు ఆనుకొని వేసిన ఫెన్సింగ్ అక్కడక్కడ మాత్రమే కానవస్తుంది. మోతీదర్వాజాను అనుకొని ఉన్న కందకంలో భారీ బండరాళ్లు, శిథిలమైన భవనాల వ్యర్థాలు డంప్ చేసి కందకాన్ని కబ్జాదారులు చదును చేస్తున్నారు.

కందకాలు చదును చేసి..


జమాలి దర్వాజా నుంచి ఎండి లైన్స్ మీదుగా నయాకీల వరకు ఉన్న కందకంలో సైతం యథేచ్ఛగా వ్యర్థాలు, పాడైపోయిన వివిధ రకాల వస్తువులు డంప్ చేస్తున్నారు. నయాకీల కందకంలో ఖాళీగా ఉన్న స్థలంలో ఒక్క నీటి చుక్క సైతం లేదు. అదే విధంగా ఫతేదర్వాజాను ఆనుకొని ఉన్న కందకాలు చదును చేసి ఆ ప్రదేశంలో ఇళ్ల నిర్మాణానికి గుట్టుచప్పుడు కాకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మోతీదర్వాజా నుంచి ఫతేదర్వాజాకు ఉన్న ప్రహరీని ఆనుకొని ఉన్న కందకాలను చదును చేసి కచ్చా ఇళ్లు ఇప్పటికే వెలిశాయి. ముందుగా కచ్చా ఇళ్ల నిర్మాణం చేసి తర్వాత వాటిని కూల్చివేసి బంగళాలు నిర్మించడానికి కబ్జాదారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దిలావర్‌షా నగర్ ప్రహరీని ఆనుకొని ఉన్న కందకాలు కూడా ఎప్పుడో వ్యర్థాలు నింపి చదును చేశారు. దిలావర్‌షా నగర్, మోతీదర్వాజా, బంజారి దర్వాజా తదితర ప్రాంతాల్లో ప్రహరీని ఆనుకొని ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. మోతీదర్వాజా వద్ద భారీ సైజు దర్వాజా గోడను ఓ వ్యక్తి తన ఇంటి గోడగా మార్చుకొని రెండు అంతస్తుల నిర్మాణాన్ని నిర్మించాడు.

జీర్ణావస్థలో వీరభద్ర స్వామి ఆలయం

- భూములున్నా ధూప దీప నైవేద్యాలూ కరువే
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఆలయ పరిసరాలు
- అభివృద్ధి చేయడంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం

శాస్త్రీపురం: ఎత్తైన రాతి కొండల మధ్య కొలువైన వీరభద్ర స్వామి ఆలయానికి ఆదరణ కొరవడింది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లిన వీరభద్రుడికి ప్రస్తుతం ధూపదీప నైవేద్యాలూ దూరమయ్యాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఆ దేవదేవుడిని పట్టించుకునే వారు లేక ఆయన ఆలయం మనుగడ ప్రమాదంలో పడింది. దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వందల సంవత్సరాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి దేవాలయం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది.

- రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్‌నగర్ డివిజన్ చింతల్‌మెట్‌లోని వీరన్న గుట్టపై శతబ్దాల క్రితం వీరభద్ర స్వామి గుడిని నిర్మించారు. ఈ వీరభద్రుడి దేవాలయానికి దాదాపు 10 ఎకరాలకు పైగా భూమి కూడా ఉన్నట్లు సమాచారం. అయినా దేవాలయాన్ని పట్టించుకునే వారు మాత్రం లేరు. ఒకప్పుడు రోజూ భక్తుల పూజలందుకున్న వీరభద్రుడు ప్రస్తుతం పూజలకు దూరంగా ఉంటున్నాడు. పట్టించుకునేవారు లేక ఆలయం జీర్ణావస్థకు చేరుకుంది.
- గతంలో పూజలు చేసేందుకు అర్చకులు ఉండేవారు. కాలక్రమేణా అర్చకులు తమ సొంత ఊర్లకు వెళ్లిపోవడంతో ప్రస్తుతం ఎవరూ ప్రత్యేకంగా పూజలు చేయడానికి లేరు.


కొండల మధ్య వీరభద్రుడి సన్నిధి
వీరభద్రస్వామి మూలవిరాట్

- పురాతన ఆలయ కావడంతో గుప్త నిధులు ఉంటాయనే ప్రచారం ఉంది. దీంతో ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని సమాచారం. కొద్ది రోజుల క్రితం ఈ దేవాలయంలోని కాళీమాత విగ్రహాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు.
- గతంలో ఏటా దసరా పండగ రోజు దేవాలయంపై కాషాయ జెండాను కట్టేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. దేవాలయం ఉన్న స్థలం విలువ కోట్లాది రూపాయలు ఉండంతో దేవాలయాన్ని లేకుండా చేయాలని కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆలయానికి సంబంధించిన స్థలంలో జోరుగా నిర్మాణాలు వెలిశాయి.
- చింతల్‌మెట్‌లోని వీరభద్ర స్వామి దేవాలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడి పెద్దరాతి గుట్టపై వీరభద్రుడు కొలువై ఉండటం ఆలయం కిందభాగంలో నీటికుంట ఉండటంతో ఈ ప్రాంతాన్ని వీరన్నకుంటగా పిలుస్తారు.
- స్వామి వారిని దర్శించేందుకు రాజేంద్రనగర్, హైదర్‌గూడ, అత్తాపూర్, కిస్మత్‌పూర్, బండ్లగూడ, ఎర్రబోడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున్న వచ్చేవారని పులువురు చెబుతున్నారు.
- వీరభద్రుడి ఆలయ పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా తయారయ్యాయి. పొదలు, బండరాళ్లు ఉండటంతో దేవాలయ పరిసరాల్లో కొందరు చేయకూడని పనులు చేస్తున్నారని వీరన్నకుంటవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- గుట్టల ప్రాంతంలో మధ్యాహ్నం, రాత్రి వేళల్లో కొంత మంది మద్యం సేవిస్తున్నానని దీంతో దేవాలయ ప్రాంతాలు అపరిశుభ్రం అవుతున్నాయని భక్తులు పేర్కొంటున్నారు. వీరి కారణంగా దేవుడి దర్శనం కోసం వెళ్లే భక్తులు ఆలయానికి వెళ్లేందుకు జంకుతున్నారు.
- ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని రాజేంద్రనగర్ ప్రజలు కోరుతున్నారు.